కేఎల్ఐ రాకతో పెరిగిన సాగు

- జిల్లాను అన్నివిధాలుగా అభివృద్ధి చేసుకుందాం
- ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

గోపాల్‌పేట, జూన్ 13: కేఎల్ఐ సాగునీరు జిల్లాకు రావడంతో పుష్కలంగా పంటలు పండుతూ అభివృద్ధి కళ్లముందే కనిపిస్తుందని ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో గురువారం ఎంపీపీ అడ్డాకుల సంధ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా చిన్నారెడ్డితోపాటు ఎమ్మెల్యే మేఘారెడ్డి, జెడ్పీచైర్మన్ లోకనాథ్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అభివృద్ధి పనుల ప్రగతి నివేదికను అధికారులు సభలో చదివి వినిపించారు.

అనంతరం చిన్నారెడ్డి మాట్లాడుతూ.. అభివృద్ధి కోసం పార్టీలకతీతంగా కలిసికట్టుగా జిల్లాను అభివృద్ధిలో ముందు వరుసలో ఉంచుదామన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు కూర్చొని గ్రామ సమస్యలను గుర్తించి సూక్ష్మ ప్రణాళిక తయారు చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి గ్రామాల అభివృద్ధికి పాటుపడాలన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్య, ప్రజలకు నాణ్యమైన వైద్యం అందేవిధంగా ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో రైతులకు వ్యవసాయ సూచనలు ఇచ్చే వ్యక్తిని నియమిస్తే మేలు జరుగుతుందన్నారు. ఆధునిక వ్యవసాయం వైపు రైతులు అడుగులు వేసేందుకు వ్యవసాయఅధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. పశువుల ఆరోగ్యం కాపాడేందుకు ఐదారు గ్రామాలకు ఒక వెటర్నరీ డాక్టర్, ప్రతి గ్రామంలో ఒక వెటర్నరీ అసిస్టెంట్ ఉండేవిధంగా ప్రభుత్వం ఆలోచిస్తుందన్నారు.

ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందని పేర్కొన్నారు. అనంతరం మండలంలోని ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మంద భార్గవి, వైస్ సింగిల్ విండో చైర్మన్ రఘుయాదవ్, ఎంపీపీ చంద్రశేఖర్, తాసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో శంకర్, మిషన్ భగీరథ ఈఈ మేఘారెడ్డి, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.


ప్రజాప్రతినిధులను సన్మానిస్తున్న చిన్నారెడ్డి, మేఘారెడ్డి, లోకనాథ్‌రెడ్డి

నాసిరకంగా బీటీరోడ్డు పనులు

- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్

మదనాపురం రైల్వేస్టేషన్ సమీపంలో నాసిరకంగా వేస్తున్న బీటీరోడ్డు

మదనాపురం, జూన్ 13 : మదనాపురం రైల్వేస్టేషన్ సమీపంలో వేస్తున్న బీటీరోడ్డు పనులు నాసిరకంగా కొనసాగుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదేంటని ప్రశ్నించిన రైతులకు క్రాంటాక్టర్ సరైన సమాధానం ఇవ్వకుండా అంతా మాఇష్టం మమ్మల్ని ఎవరు అడిగేది అని దురుసుగా సమాధానం ఇస్తున్నారు. గేట్ నెంబర్ 89ని రైల్వే అధికారులు ఏడాది కిందట మూసివేశారు. గేట్‌కు అవతలి వైపు వంద ఎకరాలకు పైగా భూములను రైతులు సాగుచేస్తున్నారు. గేట్ మూసివేస్తే తమ పరిస్థితి అధ్వాన్నంగా మారుతుందని, తమకు వేరే మార్గం చూపించాలని రైల్వే అధికారులకు రైతులు వినతిపత్రాలు అందజేశారు. స్పందించిన అధికారులు గేట్ నెంబర్ 90 నుంచి89 వరకు కిలోమీటరు మేర రూ.1.80కోట్ల నిధులతో బీటీరోడ్డు మంజూరు చేశారు. టెండర్ దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ పనులు చేపడుతున్నాడు. కంకర, డస్ట్ వేసి, కంకరను రోలర్‌తో తొక్కించకుండా నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నిర్మాణం చేపడుతుండడంతో బీటీ ఎన్నాళ్లు ఉంటుందోనని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇంతా జరుగుతున్నా రైల్వే అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో కాంట్రాక్టర్ ఆడిందే ఆట పాడిందే పాట అన్న చందంగా మారింది. ఇప్పటికైనా రైల్వే ఉన్నతాధికారులు స్పందించి బీటీ పనులను పర్యవేక్షణ చేసి నాణ్యవంతంగా చేయించాలని రైతులు కోరుతున్నారు.

లిఫ్టు మోటర్ల మరమ్మతుకు నిధులు మంజూరు చేయాలి

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

కొత్తకోట, జూన్ 13: మండలంలోని శంకరసముద్రం రిజర్వాయర్ కుడికాల్వ మోటర్ల మరమ్మతుకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డికి మండలంలోని కనిమెట్ట, పాతజంగమాయపల్లి, నిర్వేన్ రైతులు వినతిపత్రం అందజేశారు. ఇందుకు ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని, వానకాలం సీజన్‌లో రైతులకు సాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో గుంత రమణ, యాదగిరి, సాయిలుగౌడ్, కోటేశ్వర్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, వెంకటయ్య, కృష్ణయ్యగౌడ్, బాలయ్య, బాలరాజు, రామకృష్ణ, ఆంజనేయులు, గట్టుయాదవ్ తదితరులు ఉన్నారు.

ఎల్‌వోసీ అందజేత

కొత్తకోట, జూన్ 13: పట్టణానికి చెందిన శ్యామ్‌కుమార్ అనారోగ్యానికి గురై నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. ఆర్థిక సాయం కోసం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నాడు. ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ. 90 వేల ఎల్వోసీ కాపీ మంజూరు కాగా గురువారం ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి బాధితుడికి అందజేశారు. కార్యక్రమం లో మేస్త్రీ శ్రీను, కృష్ణారెడ్డి, ప్రశాంత్, బోయేజ్, క్రాంతికుమార్, వెంకటేశ్, శివ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే పాఠశాలల అభివృద్ధి

విద్యార్థులకు పుస్తకాలను అందజేస్తున్న జెడ్పీవైస్ చైర్మన్, ఎంపీపీ

- జెడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్

కొత్తకోట, జూన్ 13: తెలంగాణలో బీఆర్ఎస్ హయాంలోనే పాఠశాలల అభివృద్ధి జరిగిందని జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, ఎంపీపీ గుంతమౌనిక పేర్కొన్నారు. గురువారం కొత్తకోటలోని బాలికల ఉన్నత పాఠశాల, అప్పరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వ హయాంలోనే విద్యార్థులకు సన్నబియ్యం అన్నం, ఏకరూప దుస్తులు, నోట్ పుస్తకాలు అందించారన్నారు. అలాగే మనఊరు-మనబడి, మన బస్తీ మనబడి కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని పాఠశాలలకు మరిన్ని వసతులు కల్పించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. కేవలం పేరు మార్పిడి చేసి అమ్మ-ఆదర్శ పాఠశాలలని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుకేశిని, ప్రశాంత్, వెంకటేశ్వర్‌రెడ్డి, గోపాల్, రాఘవేంద్ర, తిరుపతయ్య, నిర్మలాదేవి, మాధవి, గీతాబాయి, శ్రీదేవి, రఘురాంజీ, రమేశ్, ప్రభావతి పాల్గొన్నారు.

రైతులకిచ్చిన హామీలను అమలు చేయాలి

అమరచింత, జూన్ 13: సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన రూ.2లక్షల రుణమాఫీతోపాటు, రైతుభరోసా ఎకరాకు రూ.15వేలు హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకుడు వెంకటేశ్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన రైతు సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ ఎదుట రైతులతో కలిసి హామీలను వెంటనే అమలు చేయాలని ఆందోళన చేపట్టారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని బ్యాంక్ మేనేజర్ శివశంకర్‌కు అందజేశారు.

అనుమతి లేకుండా క్లినిక్‌లు పెట్టొద్దు

- ఆర్ఎంపీలు ప్రాథమిక చికిత్స మాత్రమే చేయాలి
- జిల్లా వైద్యాధికారి శశికళ

గద్వాల, జూన్ 13: వైద్యశాఖ అనుమతి లేకుండా ఎవరూ ప్రైవేట్ క్లినిక్‌లు పెట్టరాదని జిల్లా వైద్యాధికారి శశికళ హెచ్చరించారు. గురువారం జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో నులిపురుగుల నివారణ దినోత్సవం, సీజన్‌వ్యాధుల వల్ల కలిగే నష్టాలు, ఆర్ఎంపీలు చేయాల్సిన వైద్యం, నూతనంగా క్లినిక్‌లు ఏర్పాటు చేసుకునేవారు తీసుకోవాల్సిన అనుమతులపై విలేకరులతో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ఆర్ఎంపీలు ప్రాథమిక చికిత్స మాత్రమే చేయాలని.. హద్దుమీరి వైద్యం చేస్తే చర్యలు తప్పవన్నారు. ఆర్ఎంపీలు ఎవరూ బోర్డుపై క్లినిక్, ప్లస్ గుర్తులు రాయించుకోవద్దని సూచించారు. తమపేరు మీద లెటర్ ప్యాడ్ కూడా ఉండొద్దన్నారు. జిల్లాలో ఆయుర్వేద, ఆయుష్మాన్ ఇతర వైద్యశాలలు ఏర్పాటు చేసేవారు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం వానకాలం సీజన్‌లో ప్రజలు ఎక్కువగా విషపురుగుల బారిన పడే అవకాశం ఉంటుంది కాబట్టి.. అన్ని పీహెచ్‌సీల్లో పాముకాటు మందుతోపాటు అన్నిరకాల మందులు అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు. గైనకాలజిస్టులు మాత్రమే స్కానింగ్ యంత్రాలు వాడాలన్నారు. ఈ యంత్రాలు ఒక దవాఖాన నుంచి మరో దవాఖానకు తరలించి స్కానింగ్ చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈనెల 27నుంచి నులిపురుగుల నివారణ కోసం మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, వసతి గృహాలు, అంగన్‌వాడీ సెంటర్లు, పని ప్రదేశాల్లో పిల్లలను గుర్తించి నులిపురుగు నివారణ మందులు వేస్తామని చెప్పారు. 1నుంచి 19ఏండ్లు నిండిన ప్రతిఒక్కరూ తప్పనిసరిగా నులిపురుగు నివారణకు మాత్రలు వేసుకోవాలని సూచించారు.

దోమకాటుతో వ్యాధులు ప్రబలే అవకాశం

ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందునవల్ల చాలా ప్రాంతాల్లో నీరు నిల్వ ఉంటుందని.. అక్కడ దోమలు చేరే అవకాశం ఉందని.. అదనపు జిల్లా వైద్యాధికారి సిద్ధప్ప పేర్కొన్నారు. దోమకాటుతో ప్రజలు మలేరియా, డెంగీ, చికున్ గున్యా వంటి వ్యాధులబారిన ప్రజలు పడే అవకాశం ఉందన్నారు. రోజువిడిచిరోజు జ్వరం రావడం, వణుకుతో కూడిన చలి, తల, ఒళ్లు, కీళ్ల నొప్పులు, రక్తహీనత వస్తే డాక్టర్‌ను సంప్రదించాలన్నారు. సమావేశంలో వైద్యసిబ్బంది మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారులు

హద్దురాళ్లను తొలగించినవారిపై చర్యలు తీసుకోవాలి

కొత్తకోట, జూన్ 13: మండలంలోని కనిమెట్ట శివారులో సర్వే నెంబర్ 348, 349, 382, 393, 394, 395, 522 పొలంలో చొరబడి హద్దు రాళ్లను తొలగించి భూమిని దున్నిన కృపాకర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన రాజేశ్వర్‌రెడ్డి, పెర్రి వెంకటేశ్వర్‌రెడ్డి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమ పొలంలో అనుమతి లేకుండా జేసీబీ సహాయంతో ప్రవేశించి చెట్లను తొలగించి, ట్రాక్టర్ సహాయంతో దున్నారని, అంతేకాకుండా వారి పొలానికి వచ్చే రహదారికి అడ్డంగా చెట్లను వేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ పొలం కౌలుకు ఇచ్చారనే అక్కసుతో ఇలాంటి చర్యలకు పాల్పడినట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై ఎస్సైని వివరణ కోరగా.. బాధితుల ఫిర్యాదు మేరకు పొలం వద్దకు వెళ్లి పంచనామా చేసినట్లు ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపారు.

యూనిఫాంలు పంపిణీ

అయిజ, జూన్ 13 : పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు గురువారం జీహెచ్ఎం రాములు యూనిఫాంలు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని, శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో విద్యా బోధన జరుగుతుందని అన్నారు. విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలతోపాటు యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం బసన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గట్టు మండలంలో..

గట్టు, జూన్ 13: మండలంలోని సల్కాపురం, ఎల్లందొడ్డిలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో డీఆర్డీఏ అదనపు పీడీ నర్సింహులు విద్యార్థులకు యూనిఫాంలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలకు యూనిఫాంలను సకాలంలో అందజేయాలని ఐకేపీ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ డీపీఎం రామ్మూర్తి, ఏపీఎం సాంబశివుడు, సీసీ జ్యోతి, హెచ్ఎంలు పాల్గొన్నారు.

పాన్‌గల్ మండలంలో..

పాన్‌గల్, జూన్ 13: మండలకేంద్రంలోని బాలికల, బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం ఎంపీటీసీ హైమావతి, హెచ్ఎం విష్ణువర్ధన్‌రెడ్డి విద్యార్థులకు యూనిఫామ్స్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందని తెలిపారు. అదేవిధంగా ఉచితంగా మధ్యాహ్నం భోజనం, పాఠ్యపుస్తకాలు తదితర సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విధులపై నిర్లక్ష్యం తగదు

గద్వాలటౌన్, జూన్ 13: విధుల పట్ల నిర్లక్ష్యం వహించడం మంచిదికాదని వైద్యులు, సిబ్బందికి జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవులు సూచించారు. జిల్లా దవాఖానలో గురువారం డాక్టర్లు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. అంతకుముందు రికార్డులను పరిశీలించి శానిటేషన్‌పై వస్తున్న ఆరోపణలపై ఆరా తీశారు. సిబ్బంది విధులు నిర్వహిస్తున్న సంబంధిత కాంట్రాక్టర్ వేతనాలు చెల్లించడంలో నిర్లక్ష్యం వహించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్ నవీన్‌క్రాంతి, డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

చేపల కుంటలను పూర్తి చేయాలి

పెబ్బేరు, జూన్ 13: ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన చేపల కుంటల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయించాలని డీఆర్డీవో నాగేంద్ర అధికారులను ఆదేశించారు. గురువారం మండలంలోని రాంపురంలో చేపట్టిన చేపల కుంట నిర్మాణానికి మార్కింగ్ ఇచ్చి ఆయన పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మా ట్లాడుతూ.. మత్స్యకారుల ఆర్థికాభివృద్ధి కోసం జిల్లాలో అనువైన గ్రామాల్లో చేపల కుంటలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. వర్షాలు ప్రారంభమయ్యే నాటికి వీటి నిర్మాణాలను పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవీందర్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

హైలెవల్ వంతెన పనులు పరిశీలన

అయిజ, జూన్ 13 : పట్టణంలోని హైలెవల్ వంతెన పనులను అఖిల పక్ష కమిటీ నాయకులు గురువారం పరిశీలించారు. పనులు ముమ్మరంగా జరుగుతుండటంతో సంతృప్తి వ్యక్తం చేశారు. పనులు సకాలంలో పూర్తి చేసి వంతెనను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు.

ప్రతిఒక్కరి ఆరోగ్య సమాచారం సేకరించాలి

- డీఎంహెచ్‌వో జయచంద్రమోహన్

వనపర్తి, జూన్ 13: జిల్లాలోని 30ఏండ్లు పైబడిన ప్రతి ఒక్కరి ఆరోగ్య సమాచారం సేకరించాలని డీఎంహెచ్‌వో జయచంద్రమోహన్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో పీహెచ్‌సీలో పనిచేస్తున్న ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలు, సూపర్‌వైజర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్ ఓరియంటేషన్‌పై డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడారు. 30ఏండ్లు పైబడిన ప్రతి ఒక్కరి ఆరోగ్య సమాచారాన్ని ఆబాకార్డుకు జత చేసి వారిని స్క్రీనింగ్ చేయాలన్నారు. స్క్రీనింగ్‌లో హైపర్ టెన్షన్, డయాబెటిస్, క్యాన్సర్ కేసులను గుర్తించి ప్రతినెలా ఫాలో అప్ చేసి మందులు ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ఎన్సీడీ ప్రోగ్రాం అధికారి రామచంద్రరావు, కోఆర్డినేటర్ శ్రీనివాస్, అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

పక్షంరోజులుగా చీకట్లో ఏడో వార్డు

అలంపూర్, జూన్ 13 : మున్సిపాలిటీలోని ఏడో వార్డు ప్రజలు పక్షం రోజులుగా చీకట్లోనే మగ్గుతున్నారు. వీధి లైట్లు వెలగక కాలనీవాసులు ఇబ్బందులకు గురి అవుతున్నారు. లైట్లు వెలగటం లేదని వార్డు కౌన్సిలర్, మున్సిపల్ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు శ్రీనివాసులు ఆరోపిస్తున్నారు. వానకాలం కావటంతో చీకట్లో ప్రజలు విష పురుగుల బారిన పడే అవకాశం ఉందని, అధికారులు త్వరగా స్పందించి వీధి లైట్లకు విద్యుత్ సరఫరా చేయించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

> **వీలైనంత త్వరలో చర్యలు తీసుకుంటాం**
>
> ఏడో వార్డులో విద్యుత్ లైట్లు వెలగడం లేదనే ఫిర్యాదులు అందాయి. వీధి దీపాల నిర్వహణ ప్రైవేట్ ఏజెన్సీ నిర్వహిస్తోంది. వారికి చెప్పి త్వరలో వీధి దీపాలు వెలిగేట్లు చర్యలు తీసుకుంటాం.
>
> -సరస్వతి, మున్సిపల్ కమిషనర్

ఏడో వార్డులో వెలగని వీధి లైటు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మానవపాడు ,జూన్13 : మండలంలోని జాతీయ రహదారిపై బుధవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వ్యక్తి మృతిచెందిన ఘటన చోటుచేసుకున్నది. ఎస్సై చంద్రకాంత్ కథనం ప్రకారం ఇటిక్యాల మండలం చాగాపురం గ్రామానికి చెందిన తగరం డానియేల్(57) తన కొడుకు జాకోబుతో కలిసి టీవీఎస్‌పై కర్నూల్‌కు బయలు దేరారు. ఎన్‌హెచ్-44పై బోరవెల్లి స్టేజీ సమీపంలోకి రాగానే కొడుకు కాలకృత్యాలు తీర్చుకునేందుకు దిగాడు. డానియేల్ వాహనం దిగి నిలబడి ఉండగా హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపునకు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో గాయాల పాలైన డానియేల్‌ను చికిత్స నిమిత్తం కర్నూల్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

'భగీరథ' ఇంటింటి సర్వే పరిశీలన

ఖిల్లాఘణపురం, జూన్ 13: మండలంలోని ఆయా గ్రామాల్లో చేపడుతున్న మిషన్ భగీరథ ఇంటింటి సర్వేను ఎంపీడీవో వెంకటాచలం గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిఇంటికీ స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేసేందుకు ప్రభుత్వం దృష్టిసారించిందని, అందులో భాగంగా మండల కేంద్రంతోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ఇంటింటి సర్వే చేపట్టి యాప్‌లో వివరాలను నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా గ్రామాల్లో పైపులైన్లు, నీటిట్యాంకులు, నల్లా కనెక్షన్లు, కనెక్షన్లు ఉన్న ఇండ్లకు నీరు సరఫరా అవుతుందా అనే అంశాలను పరిశీలించినట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో నిర్దేశించిన సమయానికి సర్వే పూర్తిచేయాలని పంచాయతీ కార్యదర్శులు, ఇతర సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

డ్రమ్‌సీడర్ పద్ధతిలో వరిసాగు

మదనాపురం, జూన్ 13: డ్రమ్ సీడర్ పద్ధతిలో వరి సాగు చేస్తే రైతుకు భారీగా ఖర్చులు తగ్గుతాయని వ్యవసాయ విస్తరణ అధికారి స్పందన అన్నారు. గురువారం మండలంలోని అజ్జకొల్లులో రైతు కావలి సత్యనారాయణ పొలంలో డ్రమ్ సీడర్ ద్వారా వరి విత్తనాలను వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డ్రమ్‌సీడర్ పద్ధతిలో వరిసాగు చేయడంతో రైతుకు నాటుకూలీల భారం తగ్గుతుందని, వరసవరసకు దూరం ఉండడంతో గాలీ, వెలుతురు తగిలి చీడపీడల నుంచి పంటను కాపాడుకోవచ్చని తెలిపారు. 2గంటల వ్యవధిలో ఎకరా పొలంలో విత్తనాలు వేసుకోవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

- చైర్‌పర్సన్ మంగమ్మ

అమరచింత, జూన్ 13: మున్సిపాలిటీ అభివృద్ధికి పాలకవర్గం కలిసికట్టుగా కృషి చేద్దామని అమరచింత మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ పేర్కొన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కౌన్సిల్ సభ్యుల సాధారణ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మొత్తం 24 ఎజెండా అంశాలపై పాలకవర్గ సభ్యులు చర్చించి తీర్మానాలు చేయగా, ముఖ్యంగా వానకాలంలో చేపట్టాల్సిన పారిశుధ్య పనులు, సిబ్బందికి వేతనాలు చెల్లించుట, వీధిదీపాలు, పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరా, కౌన్సిల్ సభ్యుల వేతనాలు, ఉద్యోగ విరమణ చేసిన వారిస్థానంలో వారసులను తీసుకోవడం తదితర వాటిపై ఏకగ్రీవ తీర్మానం చేయగా ఒక అంశంపై అభ్యంతరం తెలపడంతో వాయిదా వేసినట్లుగా చైర్‌పర్సన్ మంగమ్మ తెలిపారు. సమావేశంలో కమిషనర్ నూరుల్ నదీబ్ వైస్ చైర్మన్ గోపి, పాలక వర్గ సభ్యులు ఉన్నారు.

ప్రమాద బాధితుడికి పరామర్శ

గోపాల్‌పేట, జూన్ 13: మండల కేంద్రానికి చెందిన యువకుడు వంశీ ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభంపై నుంచి కింద పడి రెండు చేతులు మనికట్టు వద్ద విరిగాయి. విషయం తెలుసుకున్న వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి గురువారం బాధితుడిని ఇంటి వద్ద పరామర్శించారు. వనపర్తి దవాఖానలో వైద్యపరీక్షలు, వైద్యం చేయించుకోవాలని, అందుకు కావాల్సిన ఏర్పాట్లు చేస్తామని బాధిత కుటుంబానికి భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో నాయకులు సత్యశీలారెడ్డి, పర్వతాలు, శివన్న, చంద్రశేఖర్, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

బోరు వేయించిన ఎమ్మెల్యే

ఖిల్లాఘణపురం, జూన్ 13: మండలంలోని మామిడిమాడ ప్రజల దాహార్తిని తీర్చేందుకు వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి గురువారం గ్రామంలో బోరు వేయించారు. 3ఇంచుల నీరు పడడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నాయకులు వెంకటేశ్వరరావు తెలిపారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

అమరచింత, జూన్ 13: మండలంలోని ఈర్లదిన్నె, చింతరెడ్డిపల్లితో పాటు అమరచింత రైతు ఆగ్రోసేవా కేంద్రంలోని విత్తన విక్రయ కేంద్రాలను జిల్లా వ్యవసాయశాఖ అధికారి సుధాకర్‌రెడ్డి ఏవో వినయ్‌కుమార్, ఏఈవో మల్లేశ్‌తో కలిసి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్లు, బిల్లు బుక్కులను పరిశీలించారు. రసీదులు లేకుండా ఎరువులు, విత్తనాలను విక్రయిస్తే దుకాణాల లైసెన్స్‌లను రద్దు చేస్తామని హెచ్చరించారు.

గుడ్డెందొడ్డి రిజర్వాయర్‌కు నీటి విడుదల

ధరూరు, జూన్ 13: ఎగువన కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్ట్‌లోకి వరద నీరు వచ్చి చేరుతుండడంతో ముందస్తుగా నెట్టెంపాడు ఎత్తిపోతలకు నీటి విడుదలకు ప్రాజెక్ట్ అధికారులు ప్రణాళిక ఏర్పాటు చేసుకున్నారు. గురువారం ఫెజ్-1 గుడ్డెందొడ్డి లిఫ్ట్ నుంచి జెడ్పీ చైర్‌పర్సన్ సరిత జెడ్పీటీసీ పద్మావెంకటేశ్వరరెడ్డితో కలిసి రిజర్వాయర్‌కు నీటి విడుదల చేశారు. కార్యక్రమంలో ఈఈ రహీముద్దీన్, నాయకులు డీఆర్ శ్రీధర్, ఎంపీటీసీ సహదేవుడు పాల్గొన్నారు.

సివిల్ సర్వీసెస్ పరీక్షలకు శిక్షణ

వనపర్తి, జూన్ 13: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే సివిల్ సర్వీసెస్ పరీక్ష శిక్షణకు ఎస్టీ, ఎస్సీ, బీసీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ అధికారి నర్సింహారెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సివిల్ సర్వీసెస్ పరీక్షలు-2025 కోసం అభ్యర్థులకు రాజేంద్రనగర్‌లోని గిరిజన ఐఏఎస్ స్టడీ సర్కిల్ ద్వారా రెసిడెన్షియల్ పద్ధతిలో ఇంటిగ్రేటెడ్ గైడెన్స్ శిక్షణ ఇచ్చేందుకు అర్హులైన ఎస్టీ, ఎస్సీ, బీసీ అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. వెబ్‌సైట్ http://studycircle, cgg. gov.in, http://twd. tela ngana. gov.inలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, వివరాలకు ఫోన్ 6281766534 కార్యాలయంలో ప్రతిరోజూ ఉదయం 10:30నుంచి సాయంత్ర 5గంటల వరకు సంప్రదించాలని పేర్కొన్నారు.

బెస్ట్ అవైలబు